


# నేను - నా జ్ఞాపకాలు

## - జీడిగుంట రామచంద్రమూర్తి



*రచనా కాలం: 2019*

*(గత సంచిక తరువాయి)*

**1998లో** అనుకుంటాను, ఈనాడు ఆదివారం కథల పోటీ నిర్వహించింది. ఆ పోటీకోసం 'అమ్మకో ముద్దు' పేరుతో కథ రాసి పంపించాను. ఆ కథకి కన్సొలేషన్ బహుమతిని ఇచ్చి, ప్రచురించారు. ఆ కథను నాటకంగా రాసివ్వమని శ్రీ చిట్టా శంకర్ అడిగారు. నేను రాసిచ్చాను. కిన్నెర సంస్థవారు 2004లోనో, 2005లోనో నాటకోత్సవాలు నిర్వహించినపుడు ఆ నాటకాన్ని శ్రీ చిట్టా శంకర్, శ్రీమతి ఇందిర ప్రధాన పాత్రల్లో నటించి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. తర్వాత నంది నాటక పోటీలకు ఆ నాటకాన్ని ఎంట్రీగా ఇవ్వాలని అనుకున్నారు. అప్పటికి అందులో ప్రధానపాత్ర మరోదాన్ని పోషించిన శ్రీ నాగరాజారావు అందుబాటులో లేకపోవటంవల్ల ఆ నాటకం మూల పడిపోయింది. తిరిగి 2014లో గుంటూరులోని 'అభినయ ఆర్ట్స్' సంస్థవారు, 'అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్' సంస్థ నిర్వహించే నాటికల పోటీకోసం మీ దగ్గర ఏదైనా 'కథానాటిక' వుందా? అని నన్ను అడిగినప్పుడు - 'అమ్మకోముద్దు' నాటకం వుందని దాన్ని మళ్ళీ వెలికితీసి వారికి ఇచ్చాను.

"ఈ నాటకం బావుంది కానీ, దీన్ని 'నాటిక'గా రాసి ఇవ్వండి" అని వారు అడిగారు. నేను ఆ నాటకాన్ని కుదించి రాసి ఇచ్చాను. 2014 జనవరిలో జరిగిన అజోవిభో నాటికల ఆ నాటికను (పొన్నూరు) తొలిసారిగా ప్రదర్శించారు. అపుడు ఆ నాటికకు నాకు ఉత్తమ రచయిత బహుమతితోపాటు అందులో ప్రధానపాత్రలు పోషించిన శ్రీ ఎన్. రవీంద్రరెడ్డికి ఉత్తమ నటుడిగా, ఉత్తమ దర్శకుడిగా అలాగే శ్రీమతి లక్ష్మికి ఉత్తమనటిగా, బహుమతులు లభించాయి.

ఆ ప్రేరణతో అప్పటినుంచీ 2015 చివరి వరకూ ఉభయ రాష్ట్రాల్లో ఎక్కడ ఏ పరిషత్తు పోటీలు నిర్వహించినా ఆ పోటీలలో అమ్మకో ముద్దును ఆ సంస్థవారే ప్రదర్శించారు. ప్రదర్శించిన ప్రతిచోటా బహుమతుల వర్షం కురిసింది. అదే సంవత్సరం నది నాటకోత్సవాల్లో కూడా ఆ నాటికను ప్రదర్శించి కాంస్య నందిని అందుకున్నారు.

విశేషమైన ఆదరణ పొందిన ఈ నాటికను ఆ తర్వాత మా అబ్బాయి జీడిగుంట శ్రీధర్ దర్శకత్వంలో లఘుచిత్రంగా నిర్మించి హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం వారు నాలుగు భాగాలుగా ప్రసారం చేశారు. అలాగే ఈ నాటికను నాలుగు భాగాలుగా ఆకాశవాణి కేంద్రాన్నించి కూడా ప్రసారం చేయటం కోసం రాసిచ్చాను. నాటక విభాగ అధిపతి శ్రీ సి.ఎస్.రాంబాబుగారు ఆ నాటిక బాగుందని మెచ్చుకుని శ్రీమతి రతన్‌ప్రసాద్ గారితో నిర్వహింపచేసి ప్రసారం చేశారు. నేను ముందుగా కథగా రాసి తర్వాత రంగస్థల నాటికగా ఆ తర్వాత దూరదర్శన్‌కి చిత్రంగా అటుపిమ్మట రేడియో నాటకంగా మొత్తం నాలుగు రకాలుగా రాసిన రచన ఇది.

ఇక 2013లో కువైట్ తెలుగు కళాసమితి వారు నాటిక రచనల పోటీ నిర్వహిస్తే ఆ పోటీకోసం 'ప్రవృద్ధాశ్రమం' అనే పేరుతో నేను నాటిక రాసి పంపించాను. ప్రశంసాపూర్వక బహుమతిని ఆ నాటికను 2015 వ సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీన స్వర్గీయ కె.వెంకటేశ్వరరావుగారి జయంతిని పురస్కరించుకుని విశాఖపట్నంలోని శ్రీ కె.వి మెమోరియల్ ఆర్ట్స్ సంస్థవారు ప్రదర్శించి నాకు సత్కారం చేశారు.

ఈ 'ప్రవృద్ధాశ్రమం', అంతకుముందు నేను రాసిన 'అమ్మకోముద్దు', 'కీర్తిశేషుడు' నాటికలు మూడింటినీ కలిపి 'మూడు నాటికలు' పేరుతో ఒక సంపుటిగా ప్రచురించుకున్నాను. ఈ నాటికల సంపుటిని పెద్దలు శ్రీ కె.వి.రమణాచారిగారు 2017 సెప్టెంబరు నెలలో, స్థానిక త్యాగరాయ గానసభలోని కళామండపంలో ఆవిష్కరించారు. మిత్రులు శ్రీ కిన్నెర రఘురాం ఏర్పాటు చేసిన ఈ ఆవిష్కరణ సభలో శ్రీయుతులు ఆర్. ప్రభాకర్‌రావు, సుబ్బరాయశర్మ, ఓలేటి పార్వతీశం ప్రభృతులు ప్రసంగించగా పుస్తకాన్ని స్థానిక జి.వి.ఆర్. ఆరాధన సంస్థ వ్యవస్థాపకులు శ్రీ జి.వెంకటరెడ్డి, కార్యదర్శి శ్రీ వి.వి.రాఘవరెడ్డిగారులు అంకితం తీసుకున్నారు.

2018లో డా.కొలకలూరి ఇనాక్‌గారు వారి మాతృమూర్తి పేరిట నెలకొల్పిన నాటక రచనా పురస్కారం కోసం ఈ మూడు నాటికల సంపుటిని పంపించగా దీనికి రెండవ బహుమతి లభించింది. 2018 ఫిబ్రవరి నెలలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్.టి.ఆర్ కళామందిరంలో బహుమతి పురస్కార ప్రదానం జరిగిన సందర్భంలో గౌరవనీయులు శ్రీ కె.రోశయ్యగారి చేతులమీదుగా మెమొంటోను, నగదు పురస్కారాన్నీ అందుకున్నాను.

ఇక పురస్కారాల సంగతి పక్కనపెట్టి మళ్ళీ ఆకాశవాణిలో అడుగుపెడతాను. నేను ఆకాశవాణి కుటుంబ నియంత్రణ విభాగంలో స్క్రిప్టు రైటర్‌గా చేరినపుడు రాష్ట్ర ప్రభుత్వ కుటుంబ నియంత్రణ శాఖలో శ్రీ ఎన్.వి.గోపాల శాస్త్రిగారు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసేవారు. అపుడు శ్రీ దేవులపల్లి ప్రభాకరరావు ఆ శాఖలోనే ఆయన దగ్గర పి.ఆర్.ఓ.గా ఉండేవారు. తరచు రాష్ట్రంలో కుటుంబ నియంత్రణ శిబిరాలు జరుగుతుండేవి. వాటి వివరాలను మా విభాగానికి తెలియపరిస్తే, నేను మా ఇంజనీరింగు సిబ్బందితో కలిసి ఆయా శిబిరాలకు వెళ్ళి శస్త్రచికిత్సలు చేయించుకున్నవారి ఇంటర్వ్యూలు రికార్డు చేసుకొచ్చి వాటిని రేడియోలో ప్రసారం చేసేవాళ్ళం. ఆవిధంగా శ్రీ గోపాల శాస్త్రిగారు నాకు సన్నిహితులయ్యారు. అటు తర్వాత 1975లో కాబోలు ఆయన రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖకు బదిలీ అయి వెళ్ళారు. అప్పట్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలనూ, గణతంత్ర దినోత్సవ వేడుకలనూ స్థానిక పెరేడ్ గ్రౌండ్స్‌లో భారీ ఎత్తున నిర్వహించేవారు (ఇప్పుడు కూడా నిర్వహిస్తున్నారనుకోండి) వేలాదిగా జనం వచ్చి ఆ వేడుకలను తిలకించేవారు. వారికందరికీ పెరేడ్ మైదానంలో ఏం జరుగుతోందో తెలియజేయటానికి ఓ వ్యాఖ్యాత అవసరమై, శ్రీ గోపాలశాస్త్రిగారు మా ఆకాశవాణి డైరెక్టర్‌గారిని కోరారు. పరోక్షంగా ఆయన నా పేరు సూచించారు. అంతే! ఆ కార్యక్రమాలకు నేనే వ్యాఖ్యాతనైపోయాను. అప్పటినుంచీ నంది సినిమా బహుమతి ఉత్సవాలతో సహా ప్రభుత్వం ఎలాంటి సభలు నిర్వహించినా నన్నే వ్యాఖ్యాతగా పిలుస్తుండేవారు. 1975లో ప్రారంభించిన ఆ వ్యాఖ్యాన ప్రయాణం నేను ప్రమోషన్‌పై కడప ఆకాశవాణికి వెళ్ళేదాక అంటే 1988వరకూ కొనసాగిందంటే అందుకు ప్రధాన కారకులు శ్రీ గోపాలశాస్త్రిగారేనని చెప్పుకుంటూంటాను.

మళ్ళీ ఆకాశవాణిలోకి ప్రవేశిస్తే కుటుంబ నియంత్రణ విభాగంలో స్క్రిప్టు రైటర్‌గా మాత్రమే ఉద్యోగం చేస్తున్న నాకు, ఆకాశవాణిలో అధికారులు వేరే కార్యక్రమాల నిర్వహణా బాధ్యతను కూడా అప్పగిస్తూండేవారు. అందులో మున్ముందుగా చెప్పుకోవాల్సిన కార్యక్రమం 'రేడియో సంక్షిప్త శబ్దచిత్రాల ప్రసారం'

దూరదర్శన్ గృహ ప్రవేశం చేయని రోజుల్లో అంటే 1972 ప్రాంతాల్లో అనుకుంటాను. ప్రతినెలా రెండవ ఆదివారం ఉదయం పదకొండు గంటలకు ఓ గంట వ్యవధికి ఈ శబ్ద చిత్రాలను ప్రసారం చేయటం జరిగేది. ఈ శబ్ద చిత్రాలకు విశేషమైన శ్రోతల ఆదరణ లభించేది.

సికింద్రాబాద్ సరోజినీదేవి రోడ్డులో చాలామంది సినిమా డిస్ట్రిబ్యూటర్లు తమ ఆఫీసులు నిర్వహిస్తుండేవారు. నెలకు ఒకో డిస్ట్రిబ్యూటర్ని కలుసుకుని వారివద్ద అందుబాటులో వుండే సినిమా ప్రింట్లలోంచి ఒకదాన్ని తీసుకుని మా ఆకాశవాణి కారులో సారథి స్టూడియోకి తీసుకెళ్ళేవాడిని. నాతోపాటు ఇంజనీరింగ్ సహాయకులు కూడా వచ్చేవారు. సినిమాను స్టూడియోలోని థియేటర్‌లో

ప్రదర్శిస్తూంటే ఇంజనీరింగ్ సహాయకులు అక్కడి ప్రొజెక్టర్‌కి 'సౌండ్ సిస్టమ్'ని అమర్చేవారు. మొత్తం సినిమాను మేం పట్టుకెళ్ళిన టేపులమీద రికార్డు చేయటం జరిగేది. నేను ఆ సినిమాను థియేటర్లో చూస్తూనే అందులో ఏఏ ఘట్టాల్ని తొలిగించవచ్చునో ఏఏ పాటల్ని తీసేయవచ్చునో నిర్ణయించుకునేవాడిని. తర్వాత అలా రికార్డు చేసుకున్న మొత్తం టేపుల్ని మా రేడియో కేంద్రంలో వున్న 'డబ్బింగ్ స్టూడియో'కి తెచ్చి అనవసరం అనిపించిన సన్నివేశాల్ని దాటవేస్తూ మొత్తం చిత్రాన్ని గంట వ్యవధికి ఎడిట్ చేసి ప్రసారం చేసేవాడిని.

ఇక్కడ 'డబ్బింగ్ స్టూడియో' అంటే ఏమిటో మీకు తెలియజేయటం అవసరం. సినిమాల్లో 'డబ్బింగ్'కీ రేడియోలో డబ్బింగ్‌కీ తేడా ఉంది. సినిమాల్లోనైతే ఒక నటుడు నటించేటప్పుడు చెప్పిన సంభాషణలను అతని చేతనో వేరే ఆర్టిస్టు ఎవరి చేతనో పెదవులు కలిసే విధంగా చెప్పించటం అవుతుంది. ఈ ప్రక్రియకు ప్రత్యేకించి డబ్బింగ్ స్టూడియోలుంటాయి. ఇక రేడియోలో 'డబ్బింగ్' అంటే, ఎడిట్ చేసుకోవటం, సంభాషణల వెనుక సంగీతాన్ని జోడించటం సౌండ్ ఎఫెక్ట్‌లు కావలసినచోట సమకూర్చటం మొదలైన అంశాలన్నీ కలిపితే రేడియోలో డబ్బింగ్ చేయటం అనిపించుకుంటుంది. మీరు వినే నాటకాలను నిర్వహించే ప్రోగ్రాం అధికారులు ఈ పని చేస్తుంటారు. నా మటుకు నేను రేడియో నాటకాలు, నాటికలూ మొదలైన వాటిని వందకు పైగా నిర్వహించి వుంటాను.

ఇక సంక్షిప్త శబ్ద చిత్రాల ప్రసారానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియచేస్తాను.

హైదరాబాద్‌లో డిస్ట్రిబ్యూటర్లు తగ్గిపోయిన నేపథ్యంలో నేనే స్వయంగా మదరాసు వెళ్ళి అంజలీదేవిగారినీ విజయబాపినీడుగారినీ, ఎస్. భావనారాయణగారినీ ఇంకా హైదరాబాద్‌లో వుండే అక్కినేనిగారినీ, రామానాయుడుగారినీ ఇంకా చాలామంది నిర్మాతల్ని కలుసుకుని వారు నిర్మించిన సినిమాల తాలూకు ప్రింట్లనీ లేదా సీడీలనూ తీసుకుని రికార్డు చేసి, రేడియోలో ప్రసారం చేసేవాడిని. అప్పట్లో ఒకో చిత్రానికి రెండువేలూ, అలాగే సారథీ స్టూడియోలో రికార్డు చేసుకున్నందుకు ఆ స్టూడియో వారికి అయిదు వందలు చొప్పున పారితోషికం ఇచ్చేవాళ్ళం. ఆకాశవాణిలో నేను పదవీ విరమణ చేసేవరకూ (1997) అలా సంక్షిప్త శబ్ద చిత్రాలను నేనూ, నాతోపాటు అపుడప్పుడు శ్రీమతి వి. రతన్‌ప్రసాద్‌గారూ రూపొందించి ఆకాశవాణి కేంద్రాలు అన్నింటినుంచీ ప్రసారం చేసేవాళ్ళం. ఇపుడు అసలు 'శబ్ద చిత్రాలు' ప్రసారం అవుతున్నాయో లేదో నాకు తెలీదు.

ఇకపోతే నేను ఆకాశవాణిలో చేరిన కొత్తలో ఈ హైదరాబాద్ కేంద్రం ప్రసారం చేసే వేర్వేరు కార్యక్రమాల గురించి శ్రోతలు పంపే అభిప్రాయాలనూ సూచనలనూ క్రోడీకరించి 'చిత్తగించవలెను' అనే శీర్షికతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించమని అధికారులు నన్ను కోరారు. దాదాపు పదేళ్ళపాటు ఆ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం రాత్రి సమయాలలో ప్రసారం చేసేవాడిని. దానికోసం ఆ వచ్చిన ఉత్తరాలను అన్నింటినీ పరిశీలించి స్క్రిప్టు రాసుకునేవాడిని.

అలాగే ఇక కుటుంబ నియంత్రణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ వేసక్టమీ, ట్యూబెక్టమీ శిబిరాలు జరుగుతున్నాయో, ఏఏ శిబిరాల్లో ఎన్నెన్ని శస్త్రచికిత్సలు జరిగాయో మొదలైన వివరాల్ని, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వారినుంచి సేకరించి, ప్రతి సోమవారం ఉదయంపూట 'సంక్షేమ వార్తలు' పేరుతో ప్రసారం చేసేవాడిని. ఇంక రాష్ట్రంలో వుండే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కడెక్కడ లభిస్తున్నాయో 'ఎంప్లాయ్‌మెంట్ న్యూస్' అనే పత్రికలో వచ్చే ప్రకటనలనీ, దినపత్రికలలో 'కావలెను' అనే శీర్షికతో ప్రచురింపబడే వార్తలనూ సేకరించి 'ఉద్యోగవార్తలు' పేరుతో వారానికో రోజూ రేడియోలో చదివేవాడిని.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో నాకు గుర్తింపు తెచ్చిన మరో 'రెండు' కార్యక్రమాల గురించి కూడా మీతో ప్రస్తావించాలి. ఆ రెండు కార్యక్రమాల్లో మొదటిది 'నవలాస్రవంతి' ఈ కార్యక్రమంలో ప్రతి మంగళవారం రాత్రి 8.30 నిముషాలకి ఓ ప్రముఖ నవలను తీసుకుని ధారావాహికంగా చదువుతుండేవాణ్ణి. వీటిలో శ్రీ విశ్వనాథగారి 'విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు' అనే నవల చదవటం నాకు కొంచెం కష్టమైంది. గ్రాంథిక భాషలో రాయబడిన ఆ నవలను ముందుగా రెండు మూడుసార్లు నాలో నేను చదువుకుని ఆ తర్వాత రికార్డు

చెయ్యటంగానీ, 'లైవ్'లో చదవటం గానీ చేసేవాణ్ణి. ఆ తరువాత 'కథాస్రవంతి' పేరుతో సత్యం శంకరమంచి గారి అమరావతి కథలనూ, మధురాంతకం రాజారాంగరు రాసిన కథల్నీ వారానికి ఒకటి చొప్పున ఏడాదిపాటు ధారవాహికంగా చదివాను. నేను ఇక ఆరునెలల్లో రిటైర్ అవుతాననగా గోపీచంద్ గారి నవల "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా'ను చదవమన్నారు. దీన్ని చదవటంలో ఓ ప్రయోగం చేశాను. ఆ నవలలో పరమేశ్వర శాస్త్రి పాత్రకు శ్రీ జె.వి సోమయాజులుగారినీ, వారి కూతురుగా శ్రీమతి ఎ.వసంతలక్ష్మిగారినీ, ఆమె భర్తగా శ్రీ సుబ్బరాయశర్మగారినీ 'బుక్' చేసుకుని ఆ నవలలో ఆయా పాత్రలు మాట్లాడే సంభాషణల్ని వారితోనే చెప్పిస్తూ నవలను మాత్రం నేను చదువుతూ ప్రసారం చేశాను. ఈ నవలకూ, కథలకూ శ్రోతలనుంచి మంచి గుర్తింపు లభించింది.

ఇకపోతే నాకు గుర్తింపు తెచ్చిన రెండవ కార్యక్రమం 'మాటల కెరటాలు'. 1996లో మా డైరెక్టరు శ్రీ వి.వి.శాస్త్రిగారు నన్ను పిలిచి అమెరికా దేశంలో 'ఛాట్ షోలు' బాగా ఆదరణ పొందాయనీ, అలాంటి కార్యక్రమం ఒకదాన్ని మనం కూడా ప్రసారం చేస్తే బాగుంటుందనీ చెప్పారు. అప్పుడు నేను వేర్వేరు రంగాలకు చెందిన ప్రముఖుల్ని రేడియో స్టేషన్‌కి ఆహ్వానించి వారితో శ్రోతలచేత మాట్లాడిస్తూ నేను అనుసంధానం చేసే విధంగా 'మాటల కెరటాలు' పేరుతో కార్యక్రమాన్ని రూపొందిస్తే బాగుంటుందని సూచించాను. "బాగుంది ప్రొసీడ్" అన్నారు మా డైరెక్టర్ గారు.

ప్రతినెలా నాలుగో గురువారమో ఉంటే అయిదో గురువారమో నాకు సరిగా గుర్తులేదు కానీ ఆ రోజు రాత్రి 9.30 నిముషాలకి నుంచీ ఓ గంటసేపు ఆ కార్యక్రమాన్ని ప్రసారం చేయటం ప్రారంభించాం. ముందుగా డా. అక్కినేని నాగేశ్వరరావుగార్ని ఆహ్వానించాం. ఆయన్ని సగౌరవంగా మా స్టూడియోకి తీసుకురావటం కోసం, మా ఆఫీసు కారులో వారింటికి వెళ్ళాను. వారు వచ్చి మా కారు ఎక్కబోతుంటే, వెనుక డోరు తెరిచి పట్టుకున్నాను. "వద్దోయ్ నాకు ముందు సీట్లో కూర్చోవటమే అలవాటు" అంటూ డ్రైవర్ సీటు పక్కనే కూర్చున్నారు. దారిలో వస్తూ నా అలవాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందునుంచీ ఆయనతో నాకు పరిచయం వుండటం వల్ల నేనంటే ఆయనకు ప్రత్యేకమైన అబిమానం వుండేది. ఆయనకు పద్మ విభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులు వచ్చినప్పుడు కూడా వారిని మా స్టూడియోకి ఆహ్వానించి, 'ఇంటర్వ్యూ' చేసే అవకాశం దొరకటం నాకు లభించిన అదృష్టంగా భావిస్తాను.

ఓసారి 'సితార' పత్రికలో పదమూడు వారాలపాటు నేను రాసిన 'వెండితెర' సాక్షిగా కథ వ్యాసాల్ని సంపుటిగా ప్రచురించుకుని, హైదరాబాద్ త్యాగరాయగాన సభలో రసమయి రాముగారితో ఆవిష్కరణ సభ ఏర్పాటు చేయించుకున్నప్పుడు ఆ పుస్తకాన్ని శ్రీ అక్కినేని గారే ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. శ్రీ సి.నారాయణరెడ్డిగారు అధ్యక్షస్థానాన్ని అలంకరించిన ఆ పుస్తక ఆవిష్కరణ సభలో ఇంకా ఓలేటి పార్వతీశం, గుడిపూడి శ్రీహరి, ఆదివిష్ణు, కొండముది శ్రీరామచంద్రమూర్తి ప్రభృతులు ప్రసంగించారు. మిత్రులు శ్రీ సి. జె. రెడ్డిగారు ఆ పుస్తకాన్ని అంకితం తీసుకున్నారు.

మళ్ళీ 'మాటల కెరటాలు' కార్యక్రమానికి వస్తే శ్రీ అక్కినేనిగారు తర్వాత ఎందరో ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి మా స్టూడియోకి విచ్చేశారు. వారిలో శ్రీ సి.నా.రె.గారు, గుంటూరు శేషేంద్రశర్మగారు, ఇంకా శ్రీయుతులు పోతుకూచి సాంబశివరావు, నాగఫణిశర్మ, గొల్లపూడి మారుతీరావు, గణేష్‌పాత్రో, జంధ్యాల, రాజనాల, కాంతారావు, నటీమణులు శ్రీమతులు అంజలీదేవి, భానుమతి, నిర్మలమ్మ మొదలైనవారు చాలామంది ఈ కార్యక్రమంలో పాల్గొని వారిని ఇంటర్వ్యూ చేసే అవకాశం నాకు కల్పించారు. శ్రీమతి నిర్మలమ్మగారిని మాత్రం శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారు ఇంటర్వ్యూ చేశారు. ఆనాటి ఆ రికార్డింగులు, ఆర్కైవ్స్‌లో భద్రపరచటం జరిగింది. కానీ అవి ఇప్పుడు అందులో జాగ్రత్తగా వున్నాయో లేదో నాకు తెలియదు.

'పూజకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు' లభించినట్టే పూర్వజన్మ సుకృతం కొద్దీ మిత్రులు దొరుకుతారని నేను నమ్ముతాను. ఇంతకుముందు నాకు తారసపడిన మిత్రులు ఎంతోమంది గురించి ప్రస్తావించాను. వారికంటే ముందుగా ముఖ్యంగా నాకు లభించిన మిత్రులు ఇద్దరున్నారు. అందులో మొదటివారు శ్రీ ఆదివిష్ణుగారైతే, రెండవవారు శ్రీ జయదేవరెడ్డిగారు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments